ఓబులమ్మ.. బంగారం..!



ఓబులమ్మ (ఫైల్)

అందుకే దారుణంగా చంపేశారు

అవసరానికి ఆభరణాలిస్తే.. అంతం చేశారు

యర్రగుంట్లలో అమానవీయ ఘటన



ఘటనాస్థలంలో మృత దేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

గార్లదిన్నె, మార్చి 22: మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన ఓబులమ్మ వయసు 85 ఏళ్లు. అయినవారు అందరూ ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. దీంతో గ్రామంలో, తన మేనకోడలు శివలక్ష్మి ఇంట్లో ఉంటోంది. ఊరందరితో కలుపుగోలుగా ఉండే ఓబులమ్మ.. అప్పుడప్పుడూ పొలాల వద్దకు వెళుతుంటారు. ఎవరికైనా ఇబ్బంది వస్తే.. తన చేతనైన సాయం చేస్తుంటారు. ఆ మానవీయతే ఆమె ప్రాణాలను బలిగొంది. కుటుంబ అవసరాలకు డబ్బు కావాలని అదే గ్రామానికి చెందిన బీరే కృష్ణమూర్తి అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని ఓబులమ్మ చెప్పడంతో.. ఆమె బంగారు నగలను అడిగాడు. తాకట్టుపెట్టి డబ్బు తెచ్చుకుంటానని, నెల తరువాత విడిపించి ఇస్తానని, ఆ సొమ్ముకు వడ్డీకూడా ఇస్తానని నమ్మబలికాడు. గతంలోనూ పలువురి అవసరాల నిమిత్తం ఆమె బంగారు ఆభరణాలను ఇచ్చారు. కృష్ణమూర్తికి కూడా ఆమె తనవద్ద ఉన్న బంగారు చైను, నాలుగు బంగారు గాజులను ఇచ్చారు. నెల గడిచిన తరువాత అడిగితే.. అదిగో.. ఇదిగో అని కృష్ణమూర్తి కాలం గడిపాడు. గట్టిగా నిలదీయడంతో.. బంగారాన్ని కాజేసేందుకు ఆమెను అంతమొందించాడు. తన భార్య లక్ష్మీదేవి, కుమారులు బీరే భరత్‌కుమార్, బీరే లోకనాథ్, మరో బాలికతో కలిసి వృద్ధురాలిని నరికేశాడు. శరీర భాగాలను పెనచకచెర్ల డ్యామ్ వద్ద కోనేపల్లి దారిలో పెన్నానదిలో పడేశాడు.

ఇలా బయటపడింది..

ఎప్పుడూ కలివిడిగా తిరిగే ఓబులమ్మ గురువారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో చుట్టుపక్కలవారికి అనుమానం వచ్చింది. అనంతపురంలో ఉంటున్న ఆమె మేనకోడలు శివలక్ష్మికి సమాచారం ఇచ్చారు. ఆమె గ్రామానికి వచ్చి.. స్థానికులతో కలిసి తోటలో వెతికారు. కనిపించకపోవడంతో గార్లదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్థులను విచారించి, పరిసర ప్రాంతాల్లో వెతకడం ప్రారంభించారు. దీంతో భయపడిన కృష్ణమూర్తి.. యర్రగుంట్ల ఇన్‌చార్జి వీఆర్వో గోవిందరాజులు వద్ద లొంగిపోయాడు. పోలీసులు విచారించగా.. వృద్ధురాలిని ఎలా చంపేసిందీ వివరించాడు. అనంతపురం డీఎస్పీ వెంకటశివారెడ్డి ఈ వివరాలను గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరులకు తెలియజేశారు.

ముక్కలుగా నరికేశాడు..

బంగారు నగలు ఇస్తానని నమ్మించి, ఓబులమ్మను తన ద్విచక్ర వాహనంపై వరిమడి వద్దకు కృష్ణమూర్తి తీసుకువెళ్లాడు. అక్కడ ఆమెను గొడ్డలితో విచక్షణా రహితంగా నరికాడు. తల, కాళ్లు, చేతులను ముక్కలు చేశాడు. వాటిని యూరియా సంచులలో వేసుకుని, ట్రాక్టర్‌లో తీసుకెళ్లి పెనచకచెర్ల డ్యామ్ కోనేపల్లి దారిలో పెన్నానదిలో పడేశాడు. ఈ కేసులో నిందితులు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలి, ద్విచక్ర వాహనం, ట్రాక్టర్, మృతురాలి చెప్పులు, శరీర భాగాలను స్వాధీనం చేసుకున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బుక్కరాయసముద్రం, మార్చి 22: మండల పరిధిలోని నీలారెడ్డి పల్లి గ్రామానికి చెందిన రైతు సుంకర భాస్కర్ (64) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. భాస్కర్‌కు రెండు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయమే జీవనాధారం. కుటుంబ, సేద్యపు అవసరాలు, కూతురు పెళ్లి కోసం రూ.10 లక్షలపైగా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గంలేక తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. పొలం వద్ద శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా పక్క తోట రైతులు గమనించి చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతిచెందాడని పోలీసులు తెలిపారు. రైతు భాస్కర్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోడ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి

ప్రచారంలో పాల్గొనే వలంటీర్లపై చర్యలు తీసుకోండి

అధికారులకు కలెక్టరు గౌతమి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టరు గౌతమి

అనంతపురం టౌన్, మార్చి 22: ఎన్నికల కోడ్ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మరింత బాధ్యతగా పనిచేయాలని జిల్లా అధికారులకు కలెక్టరు గౌతమి సూచించారు. జిల్లా అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వైద్య, హౌసింగ్, పంచాయతీ శాఖల అధికారులతో శుక్రవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండులు, రైల్వే స్టేషన్‌లలో ఎక్కడా రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, పోస్టర్లు, బ్యానర్లు, ఫొటోలు, లోగోలు ఉండకుండా చూడాలని అన్నారు. ప్రైవేటు భవనాలపై కూడా వాల్ రైటింగ్స్, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండకూడదని అన్నారు. కోడ్ అమలును ప్రతిరోజూ పర్యవేక్షించాలని అన్నారు. ఆర్వోలు కోడ్ అమలు బృందాలతో సమావేశాలు నిర్వహించి, కోడ్ పక్కాగా అమలయ్యేలా చూడాలని అన్నారు. ప్రభుత్వంలో పనిచేస్తున్న ఏ ఒక్కరూ రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాదని అన్నారు. రాజకీయ, ప్రచార కార్యక్రమాలలో పాల్గొనే వలంటీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఫోన్ వస్తే వెంటనే అప్రమత్తమై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, వంద నిమిషాలలో పరిష్కరించి, నివేదిక పంపాలని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు కోడ్ ఉల్లంఘనల ఫిర్యాదులు వస్తుంటాయని, పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో జేసీ కేతన్ గార్గ్, జడ్పీ సీఈఓ మైఖేల్ నిదియా, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

వీరాంజిని ఓడిస్తాం..!

అభ్యర్థిని మార్చకుంటే శ్రావణి కోసం పనిచేస్తాం

కావాలంటే వైసీపీ నుంచి సస్పెండ్ చేసుకోండి..!

ఆలూరు సాంబను బాధ్యతల నుంచి తప్పించండి

శింగనమలలో వైసీపీకి ఇంత దుర్భర పరిస్థితా...?

భగ్గుమన్న అధికార పార్టీ అసమ్మతి నాయకులు



వైసీపీ అసమ్మతి నాయకులు

బుక్కరాయసముద్రం, మార్చి 22: 'వీరాంజినేయులును మార్చి.. వేరే అభ్యర్థిని ప్రకటించండి. లేదంటే ఖచ్చితంగా ఓడిస్తాం. టీడీపీ అభ్యర్థి శ్రావణి కోసం పని చేసి.. ఆమెను 50 వేల మెజార్టీతో గెలిపిస్తాం. కావాలంటే మమ్మల్ని సస్పెండ్ చేసుకోండి..' అని వైసీపీ శింగనమల నియోజకవర్గ అసమ్మతి నాయకులు సీఎం జగన్‌కు అల్టిమేటమ్ జారీ చేశారు. పార్టీ అభ్యర్థి వీరాంజినేయులుకు వ్యతిరేకంగా శుక్రవారం వారు మరోమారు సమావేశమయ్యారు. వీరాంజినేయులును ఓడించి, తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ కావడం ఖాయమని అన్నారు. వైసీపీ అభ్యర్థిగా వీరాంజినేయులును ప్రకటించినప్పటి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి వ్యతిరేకవర్గం తీవ్ర అసంతృప్తితో రగిలిపోతోంది. సాంబ ఇంట్లో మనిషికి టిక్కెట్ ఇవ్వడం ఏమిటని ఆగ్రహిస్తూ.. ఇప్పటికే పలుమార్లు సమావేశం నిర్వహించారు. అభ్యర్థిని మార్చాలని పార్టీకి అల్టిమేటమ్ జారీ చేశారు. అయినా తుది జాబితాలో మార్పు లేకుండా, వీరాంజనేయులు అభ్యర్థిత్వాన్ని పార్టీ ఖరారు చేసింది. దీంతో తాజాగా మరోసారి అనంతపురం నగరంలో అసమ్మతి నాయకులు సమావేశమయ్యారు.

సమరమే..

శింగనమల నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు, పార్టీ మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. తాజా పరిణామాలపై చర్చించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. శింగనమల నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తారని వారు అన్నారు. శింగనమల నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు తీవ్రత తమ పార్టీపై రాష్ట్రవ్యాప్తంగా ఉంటుందని అన్నారు. సీఎం జగన్ వెంటనే నిద్ర మేల్కొని, పార్టీ అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఖచ్చితంగా ఓడిస్తామని బహిరంగంగా చెబుతున్నామని అన్నారు. శింగనమల నియోజకవర్గంలో ఆలూరు సాంబశివారెడ్డి ఒంటెద్దు పోకడ పోయారని విమర్శించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకూ వారి కుటుంబ సభ్యులే ఇన్‌చార్జిలుగా వ్యవహరించారని మండిపడ్డారు. అవినీతి, అక్రమాలకు పాల్పడి, కోట్లాది రూపాయలు సంపాదించారని ఆరోపించారు. ఆయన తీరుతో నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవుతోందని అన్నారు. ఇప్పటికైనా వైసీపీ అధిష్ఠానం స్పందించాలని, ఆలూరు సాంబశివారెడ్డిని తప్పించి, మరొకరికి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించాలని సూచించారు.



అసమ్మతి నాయకుల సమాలోచన

నాలుగురోజుల్లో భారీ బహిరంగ సభ

శింగనమల నియోజకవర్గంలో అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తూ నాలుగు రోజుల్లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వైసీపీ అసమ్మతి నాయకులు తెలిపారు. పార్టీ నుంచి తమను సస్పెండ్ చేసినా పర్వాలేదని, వీరాంజినేయులును ఓడించేందుకు నియోజకవర్గం అంతటా తిరుగుతామని, టీడీపీ అభ్యర్థిని గెలిపిస్తామని అన్నారు. తమ సత్తా ఏమిటో బహిరంగ సభ ద్వారా చూపిస్తామని అన్నారు. అభ్యర్థిని మార్చి, మరొకరికి అవకాశం ఇస్తే గెలిపిస్తామని అన్నారు. వైసీపీ అభ్యర్థి తరఫున నియోజకవర్గంలో ప్రస్తుతం 30 మంది కూడా ప్రచారం చేయడం లేదని అన్నారు. డీలర్లు, వలంటీర్లను పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని అన్నారు. అదే టీడీపీ అభ్యర్థి వేల మందితో ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితికి తమ పార్టీ నాయకులు సిగ్గుపడాలని వారు అన్నారు. నియోజకవర్గంలో పార్టీకి ఇంత దుర్భర పరిస్థితి వస్తుందని ఊహించలేదని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే యామినిబాల, నార్పల మండలం నుంచి మాజీ మార్కెట్ చైర్మన్‌లు సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చాములూరి రాజగోపాల్, శింగనమల మండలం నుంచి నాయకులు గోకుల్ కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ నాగేష్, సాకే రామక్రిష్ణ, మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ వెంకటరెడ్డి, బోనా నాగలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటికాడి ముద్ద లాగేశారు..!

ఐదేళ్ల క్రితం అన్న క్యాంటీన్‌లు మూసివేత

టీడీపీ హయాంలో పేదల ఆకలి తీర్చిన క్యాంటీన్‌లు

రూ.5 ఇస్తే.. రుచికరమైన అల్పాహారం.. భోజనం

వైసీపీ అధికారంలోకి వచ్చాక అడ్డుకున్న వైనం



బళ్లారి బైపాస్ సమీపంలో టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్ వద్ద క్యూలో ఉన్న జనం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 22: అన్న క్యాంటీన్..! పేదల ఆకలి తీర్చిన అక్షయ పాత్ర..! ఐదేళ్ల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా ఇవి ఉండేవి. పనుల నిమిత్తం పట్టణ, నగర ప్రాంతాలకు వచ్చిన రైతులు, కూలీలు, ఇతర వర్గాల పేదలు రూ.5 ఇచ్చి.. అన్న క్యాంటీన్‌లలో కడుపు నిండా భోజనం చేసేవారు. వీరితోపాటు స్థానికంగా ఉండే అన్నార్థులు కూడా అన్న క్యాంటీన్‌లను ఆశ్రయించేవారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన గొప్ప పథకం ఇది. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ పేరిట, ఆయనను అభిమానులు ప్రేమగా పిలుచుకునే 'అన్న' అనే పేరిట క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. 2018 జూన్ 11న రాష్ట్ర వ్యాప్తంగా.. ఒక్కో నియోజకవర్గంలో రెండు, మూడు అన్న క్యాంటీన్‌లను ప్రారంభించారు. అప్పట్లో క్యాంటిన్లు జనాలతో కిటకిటలాడేవి. భోజనం పెట్టిన వారు చల్లగా ఉండాలని దీవించి వెళ్లేవారు. అంతటి ప్రాధాన్యం ఉన్న అన్న క్యాంటీన్‌లు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. చెత్తాచెదారంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. మరికొన్ని క్యాంటిన్‌లు మందుబాబులకు, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక.. అన్న క్యాంటీన్‌లను ఆపేశారు.

రూ.5 కే రుచికరమైన భోజనం

పేదోడి కడుపు నిపేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లలో రుచికరమైన, నాణ్యమైన భోజనం రూ.5కు లభించేది. రక రకాల కూరలతో భోజనం అందించేవారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టేవారు. ఉదయం ఇడ్లీ, చెట్నీ, సాంబారు, పూరీలు, కూర్మా వంటివి లభించేవి. బుధవారం, శనివారాలలో ప్రత్యేకంగా పొంగల్, చెట్నీ, పొడి, సాంబారు, మిక్చర్ అందించేవారు. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో అన్నంతో పాటు కూర, పప్పు, సాంబార్, పెరుగు, పచ్చడి ఇచ్చేవారు. ఒక్కో క్యాంటిన్‌లో ఉదయం 300 మందికి, మధ్యాహ్నం 360 మందికి, రాత్రి వేళల్లో 250 మందికిపైగా భోజనం పెట్టేవారు. ఇలా రోజూ వేలాది మందికి భోజనం సమకూరేది.

రూ.లక్షలు వెచ్చించారు..

అన్న క్యాంటీన్‌ల ఏర్పాటును అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.150 కోట్లు వెచ్చించి నిర్మించింది. ఒక్కో క్యాంటిన్ ఏర్పాటుకు రూ.2 లక్షలు వెచ్చించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. అనంతపురం నగరంలో 3, గుంతకల్లు, హిందూపురం, పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, మడకశిరలో ఒక్కొక్కటి, ధర్మవరంలో రెండు క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. వీటి కోసం రూ.25 లక్షల వరకూ వెచ్చించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక క్యాంటీన్‌లను ఎత్తేశారు.

టీడీపీ నేతలే దిక్కు

వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను మూసివేయడంతో వాటిని నడిపించే బాధ్యతను టీడీపీలోని కొందరు నాయకులు తీసుకున్నారు. మంగళగిరిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్న క్యాంటీన్‌ను పునః ప్రారంభించారు. ఆయన పిలుపు అందుకున్న జిల్లా నాయకులు పలువురు తమ సొంత డబ్బుతో పేదల ఆకలి తీర్చడం ప్రారంభించారు. మూడు పూటలా భోజనం, అల్పాహారం పెట్టారు. దీన్ని చూసి ఓర్వలేని వైసీపీ ప్రభుత్వం, అడ్డంకులు సృష్టించింది. కొన్నిచోట్ల క్యాంటీన్లను ధ్వంసం చేయించింది. గొడవలు సృష్టించి, మూతబడేలా చేసింది.



రైల్వే స్టేషన్ సమీపంలో అన్న క్యాంటీన్ వద్ద క్యూలో నిల్చున్న విద్యార్థులు, ప్రజలు (ఫైల్)



చెత్తాచెదారంతో నిండిపోయిన రైల్వేస్టేషన్ సమీపంలోని అన్న క్యాంటీన్



శిథిలావస్థలో అన్న క్యాంటీన్

సచివాలయాలుగా మార్పు

అన్న క్యాంటీన్లలో కొన్ని భవనాలను వైసీపీ ప్రభుత్వం సచివాలయాలుగా మార్చింది. రంగులు మార్చేసి, క్యాంటీన్ల ఆనవాళ్లు లేకుండా చేసింది. హిందూపురంలో రెండు అన్న క్యాంటీన్‌లు ఉండేవి. వాటిని వార్డు సచివాలయాలుగా మార్చేసింది. కదిరిలో ఒకటి, ధర్మవరంలో ఒక క్యాంటీన్ భవనాన్ని వార్డు సచివాలయానికి వినియోగిస్తున్నారు.

అసాంఘిక శక్తుల అడ్డా

పేదల కడుపు నింపేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అప్పట్లో కడుపు నింపిన క్యాంటీన్లు.. ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. చెత్తా చెదారంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. వాటి ఆలనాపాలనను పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. రాత్రివేళల్లో మందుబాబులు తిష్ట వేస్తున్నారు. ఖాళీ మద్యం బాటిళ్లతో క్యాంటీన్‌లు అపరిశుభ్రంగా మారాయి. మరికొన్ని చోట్ల క్యాంటీన్లకు ఆనుకొని వైన్‌షాపులు, బార్లు ఉండటంతో పగటిపూటే మందుబాబులు అక్కడ మద్యం సేవిస్తున్నారు. మరికొన్ని చోట్ల మూత్రవిసర్జన శాలలుగా ఉపయోగిస్తున్నారు.

ఉష్ణోగ్రతలు (శుక్ర)

గరిష్ఠం : 38.0

కనిష్ఠం : 25.0



ఇఫ్తార్	శనివారం సాయంత్రం	06:32
సెహరీ	ఆదివారం ఉదయం	05:05

ఎప్పుడూ ఇంతే..!

పంట చేతికి రాగానే తగ్గుతున్న ధర

రైతుకు కన్నీరు మిగిల్చుతున్న మిరప

భారీగా పడిపోయిన ధర

కొనేవారు లేక పొలాల్లోనే మిరప రాశులు

దిగుబడి కూడా అంతంతమాత్రమే



పొలాల్లోని మిరప రాశులు

ఉరవకొండ, మార్చి 22: ధరలు పడిపోవడంతో మిర్చి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ధరలు అమాంతం పడిపోవడంతో పంటను కొనేవారులేక, పొలాల్లోనే రాశులు పోసుకుని గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు నిరీక్షిస్తున్నా రు. ఉరవకొండ ప్రాంతంలో మిరప అధికంగా సాగు అవుతోంది. హంద్రీనీవా, జీబీసీ, హెచ్చెల్సీ కింద ఈ ఏడాది 30వేల ఎకరాలకు పైగా మిరప సాగైంది. హంద్రీనీవా కాలువకు నీరు వచ్చినప్పటి నుంచి మిరప సాగు గణనీయంగా పెరుగుతోంది. బ్యాడిగ, డబ్బీ, తేజ, 273, 4884తో పాటు మరిన్ని రకాల మిరపను రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.2లక్షల దాకా పెట్టుబడులు పెట్టారు. కూలీల ఖర్చులు కూడా అధికంగానే ఉంటున్నాయి. గత ఏడాది మిరపలోని డబ్బీ, బ్యాడిగ రకాల ధర క్వింటా రూ.70 వేలు దాకా పలికింది. డబ్బీ, బ్యాడిగ రకాలు సాధారణంగా రూ.40 వేలకు తగ్గలేదు. ప్రస్తుతం మార్కెట్లో రూ.27 వేల నుంచి 32 వేలు వరకు ధరలు పలుకుతున్నాయి. అది కూడా కాయ రకాన్ని బట్టి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీడ్స్ రకాలు క్వింటా రూ. 10 వేలు నుంచి రూ. 20 వేలలోపే ఉంది. కాగా కౌలు రైతులు పరిస్థితి మరీ అధ్వానంగా మారంది. వీరు ఎకరాకు రూ.40 వేలు కౌలు చెల్లించేలా ఒప్పందం చేసుకుని పంట సాగు చేశారు. దీనికి పెట్టుబడి అదనం కావడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వారు వాపోతున్నారు. ధరలు తగ్గడమే కాకుండా ఈ ఏడాది ఫలసాయం కూడా తగ్గిందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. గత ఏడాదికి ఎకరాకి 15 క్వింటాళ్లకి మించి దిగుబడి రాగా ఈసారి 9 క్వింటాళ్ల లోపే ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శీతల గిడ్డంగులు లేక ఇబ్బందులు

మిరప పంట దిగుబడులను నిల్వ చేసుకునేందుకు అవసరమైన శీతల గిడ్డంగులు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ లేవు. దీంతో రైతులు కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు మిరప పంటను తరలించి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇది రైతులకు అదనపు భారమే. రైతులు బ్యాడిగ ప్రాంతంలో నిల్వ ఉంచితే ఆ తర్వాత వారి దిగుబడిని పరిశీలించుకోవడానికి అవకాశముండదు. మిరప పాడైనా దిక్కుండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉరవకొండలో విశాలమైన మార్కెట్ ప్రాంగణం ఉంది. అక్కడ ఎలాంటి క్రయవిక్రయాలు లేవు. పెద్ద గోదాములు ఉన్నా వాటిని సాధారణ అద్దెకు బయటి వ్యక్తులకు ఇస్తున్నారు. వాటిని శీతల గిడ్డంగులుగా మార్చేందుకుగానీ, కొత్తగా శీతల గిడ్డంగులు నిర్మించేందుకు గానూ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మిరపను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కొనేవారే లేరు

మిరపధరలు అమాంతం పడిపోయాయి. 13 ఎకరాల్లో మిరపపంటను సాగు చేశా. ఎకరాకు రూ.2లక్షలు దాకా పెట్టుబడులు పెట్టాం. కౌలుకు రూ.50వేలు దాకా చెల్లించాం. అమ్ముదామన్న కొనేవారు లేరు. దిగుబడి కూడా అంతంత మాత్రమే. క్వింటా రూ.27వేలకు మించి అడగడం లేదు.



\- బొజ్జన్న, రైతు, వేల్పుమడుగు

అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాం



అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాం. మూడు ఎకరాలు మిరప పంటను సాగు చేశాం. పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోయాయి. వ్యాపారులు అడిగిన రేటుకు అమ్ముకోవాల్సి వస్తోంది.

\- పురుషోత్తం, రైతు చిన్నముష్టూరు



విదుశేఖరభారతీస్వామికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలి

విదుశేఖర భారతీస్వామి



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్, మార్చి 22: సనాతన ధర్మాన్ని, హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలని శృంగేరి శంకరమఠానికి చెందిన విదుశేఖర భారతీస్వామి పేర్కొన్నారు. స్థానిక శారదానగర్‌లోని శంకరమఠంలో శారదా పరమేశ్వరి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో పాల్గొనేందుకు విదుశేఖర భారతీ స్వామి శుక్రవారం సాయంత్రం శంకరమఠానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అర్చక బృందం స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణంలో స్వామీజి భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. భారతీ తీర్థ మహాస్వామి తదితర మహనీయులు దేశపర్యటనలు చేసి హిందూ సంప్రదాయాన్ని నలుదిశలా వ్యాపింపజేశారని తెలిపారు. మహాస్వామి అనంతపురం వచ్చి శారదామాత, ఆదిశంకరాచార్యుల విగ్రహాలను ప్రతిష్ఠించారని, గురువు ప్రతిష్ఠించిన ఆలయంలో తన చేతులమీదుగా ప్రతిష్ఠ చేసే అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. నగరంలో శంకరమఠం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందని కొనియాడారు. ఆరు సంవత్సరాల క్రితం ఇదే ఆలయంలో మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠకు వచ్చానని, ఇప్పుడు మరోసారి శారదా పరమేశ్వరి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ కోసం వచ్చానని అన్నారు. వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం అష్టావధానం నిర్వహిస్తామన్నారు. అమ్మవారి ప్రేరణతోనే అనంతపురంలో మూడు రోజుల పాటు పూజల్లో పాల్గొనే అవకాశం దక్కిందన్నారు. రాత్రి ఆలయ ఆవరణంలో చంద్రమౌళీశ్వరస్వామి పూజలు నిర్వహించారు.

రాష్ట్రంలో విచ్చలవిడిగా

గంజాయి, డ్రగ్స్ రవాణా

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు

అనంతపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా రవాణా జరుగుతోందని మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్టణంలో 25 వేల కిలోల డ్రగ్స్ పట్టుబడటంపై పాలకులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో స్పష్టంగా అర్థమవుతోందన్నారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్న అనుచరులు నకిలీ మద్యం వ్యాపారంలో, మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌లో ఆరితేరారని ఆరోపించారు. విశాఖలో డ్రగ్స్ పట్టుబడటంపై వస్తున్న విమర్శలు, ఆరోపణలను సజ్జల జీర్ణించుకోలేక తెలుగుదేశం పార్టీని ఆడిపోసుకుంటున్నారని మండిపడ్డారు. వై ఎస్ జగన్ రాజధానిగా చేస్తానన్న విశాఖలోనే పెద్ద ఎత్తున డ్రగ్స్ రాకెట్ బయటపడటం సిగ్గుచేటన్నారు. జగన్ అనుచరులు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ధిక్కరించి యథేచ్ఛగా విశాఖ మాన్యంలో సహజవనరులను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. పట్టుబడిన మాదక ద్రవ్యాల్లో అతి ప్రమాదకరమైన డ్రగ్స్ ఉన్నాయని స్పష్టమైందన్నారు. ప్రభుత్వ అధికారులు సహకరించడం లేదని స్వయంగా సీబీఐ ఆ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొందన్నారు. విశాఖలో పట్టుబడిన గంజాయిలో జగన్ అండ్ గ్యాంగ్ ప్రమేయముందనేది ప్రస్ఫుటంగా కనిపిస్తోందన్నారు.

తాగునీరు, ఉపాధి పనులపై శ్రద్ధ పెట్టండి

కలెక్టరుకు సీఎస్ ఆదేశం

అనంతపురం టౌన్, మార్చి 22: ఎండాకాలం నేపథ్యంలో ఎక్కడా తాగునీరు, ఉపాధి పనుల విషయంలో ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు గౌతమికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం సీఎస్ కలెక్టరు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎండలు పెరిగిన నేపథ్యంలో ఉదయం 5.30 గంటల నుంచి 10.30 గంటల వరకే ఉపాధి పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరాను పర్యవేక్షించేందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. వివిధ మంచినీటి పథకాలకు సంబంధించి మరమ్మత్తులుంటే వాటిని వెంటనే రిపేరు చేయించాలన్నారు. నీటికి సంబంధించి నిధుల సమస్య ఉండబోదని, సకాలంలో వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టరు గౌతమి మాట్లాడుతూ... జిల్లాలో తాగునీరు, ఉపాధి పనులకు సంబంధించి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ జవహర్‌కుమార్, హెచ్‌ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

గణిత పరీక్షకు 3, 274 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 22: పదో తరగతి పరీక్షల్లో గణితం పేపర్‌కు ఏకంగా 3,274 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం జిల్లాలోని 142 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా... మొత్తం 37,293 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 34,019 మంది హాజరయ్యారు.

లక్ష్యాలు పూర్తి చేయండి: మార్కెటింగ్‌శాఖ జేడీ

అనంతపురంరూరల్, మార్చి 22: మార్కెట్ ఫీజు లక్ష్యాలను ఈనెల ఆఖరిలోపు పూర్తి చేయాలని మార్కెట్ కమిటీ కార్యదర్శులకు మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజినేయులు ఆదేశించారు. శుక్రవారం జిల్లా మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ సమయం ఉన్నందున వసూళ్లపై ప్రణాళికబద్ధంగా లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించాలన్నారు. గుంతకల్లు, రాప్తాడు, గుత్తి మార్కెట్ కమిటీలు లక్ష్యసాధనలో వెనకబడ్డాయన్నారు. ఉమ్మడి జిల్లాలో మార్కెట్ కమిటీ ఫీజు వసూళ్లు ఆశాజనంగా ఉన్నాయని, చాలా కమిటీలు 90శాతానికిపైగా వసూలు చేశాయన్నారు. వందశాతం వసూళ్లకు కృషి చేయాలన్నారు. అనంతరం అనంతపురం మార్కెట్ కమిటీని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో సమావేశమయ్యారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 22: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరిలో బీఫార్మసీ తృతీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్19)రెగ్యులర్, సప్లమెంటరీతో పాటు (ఆర్15) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా ద్వితీయ సెమిస్టర్(ఆర్19,15) సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.


రూ.5.30 లక్షలు సీజ్

కదిరి, మార్చి 22: పట్టణ శివారులోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో పోలీసుల తనిఖీలో రూ. 5 లక్షల 30వేలు సీజ్ చేసినట్లు ఎస్ఐ బాబ్‌జాన్ తెలిపారు. శుక్రవారం ఓడీసీకి చెందిన గురుశేఖర్ కదిరికి వస్తుండగా తనిఖీ చేశామన్నారు. తనిఖీల్లో డబ్బును సీజ్ చేసి ఆర్డీవో వంశీకృష్ణకు అప్పగించినట్లు చెప్పారు. తనిఖీల్లో సీఐ పుల్లయ్య పాల్గొన్నారు.

సీ విజిల్ యాప్‌తో అక్రమాలకు అడ్డుకట్ట

ఎలక్షన్ కమిషన్ కొత్త ప్రయోగం

- గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో యాప్
- సామాన్య ప్రజలనూ భాగస్వామ్యం చేసేందుకే..
- ఆడియో, వీడియో, ఫొటోల ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు
- ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లోనే స్పందన
- వందనిమిషాల్లో చర్యలు



రిజిస్ట్రేషన్ ఇలా..



ధర్మవరం

ఎలాంటి అక్రమాలు జరగకుండా సార్వత్రిక ఎన్నికలను సాఫీగా నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ఠ చర్యలను చేపడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమయ్యే అన్ని రకాల వనరులను ఈసీ వాడుకుంటోంది. అందులో భాగంగానే తీసుకొచ్చిన సీ విజిల్ యాప్ ద్వారా సామాన్య ప్రజలను కూడా భాగస్వామ్యం చేసింది. ఎన్నికల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన నాయకుల పని పట్టేందుకు దీనిని పాశుపతాస్త్రంగా ఉపయోగించుకోవచ్చు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశ, నిర్దేశం చేసే సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)అమలులోకి వచ్చేసింది. ప్రస్తుతం ఉమ్మడిజిల్లాలో ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మారాయి. అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎలాగైనా గెలవాలని దురుద్దేశ్యంతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోయే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల నిబంధనలను సైతం తుంగలో తొక్కేవాళ్లులేకపోలేదు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా వలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ కన్ను సన్నల్లో పని చేసేందుకు సిద్ధమవుతోంది. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటుచేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వామ్యం చేసింది. సీ విజిల్ యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. నిబంధనలు ఉల్లంఘించేవారిని పట్టించేందుకు సీ విజిల్ ఎంతగానో దోహదం చేయనుంది.

సీ విజిల్ అంటే ఏమిటి?

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ సీ విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫోటో లేదా వీడియోలేదా ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్‌చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని ప్రజలు ఎవరైనా వినియోగించుకోవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

ఐదు నిమిషాల్లో రంగంలోకి...

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దాన్ని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిక ఇస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది.

రిజిస్ట్రేషన్ చేసుకోవడమెలా?

సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించిన సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ నెంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసుకుంటే సీ విజిల యాప్ సిద్ధమైనట్లే. దీని ద్వారా ప్రజలు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎలా ఫిర్యాదు చేయాలి?

యాప్ ఓపెన్ కాగానే స్ర్కీన్‌పై ఫోటో, వీడియో, ఆడియో ఇలా మూడు ఆప్షన్లు ఉంటాయి. ఫోటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫోటో ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. మీ లోకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫోటోను అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఎన్నికల సంఘానికి చేరుతుంది. యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లాఎన్నికల అధికారి సంబంధిత విషయంపై విచారణ జరుపుతారు. సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారు. ఇక్కడ ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘనలు కనిపిస్తే ఎవరైనా సీ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ఎలాంటి ఫిర్యాదులు చేయాలంటే..

ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన దేనిపైనానాసరే ఫిర్యాదు చేయవచ్చు. డబ్బుపంపకాలు, ఉచితాలు, బహుమతులు అందజేయడం, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తుపదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాలలో తరలించడం ఇలాంటి ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించిన ఫోటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేయాలి.

ప్రచారం వీడని వలంటీర్లు

వైసీపీ అభ్యర్థులతో చెట్టాపట్టాల్... విధుల నుంచి పలువురి తొలగింపు





కుర్మాజీపేటలో తాడిపత్రి ఎమ్మెల్యే తనయుడు హర్షవర్ధన్ రెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్నగ్రామ వలంటీర్లు రాజశేఖర్, రామాంజనేయులు



ఆర్ అనంతపురం గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పతో కలిసి ప్రచారంలో పాల్గొన్నగ్రామ వలంటీరు రామకృష్ణ



తాడిపత్రి లో వైసీపీ కండువా కప్పించుకుంటున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మునీర్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వసగుడ్డం గ్రామ స్టోర్‌డీలర్ నాగరాజు (ఆకుపచ్చ రంగు చొక్కా వేసుకున్న వ్యక్తి)

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో గ్రామ వలంటీర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. అధికార పార్టీ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఈ కారణంగా అధికారులు శుక్రవారం కూడా పలువురిపై చర్యలు తీసుకున్నారు.

- తాడిపత్రి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పెద్దారెడ్డి తరఫున ఆయన తనయుడు హర్షవర్ధన్ రెడ్డి యాడికి మండలం కుర్మాజీపేటలో శుక్రవారం ప్రచారం చేశారు. రాజశేఖర్, రామాంజనేయులు అనే ఇద్దరు గ్రామ వలంటీర్లు ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి, తగిన చర్యలు తీసుకుంటామని రాయలచెరువు పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ తెలిపారు.
- మడకశిర నియోజకవర్గ పరిధిలోని ఆర్ అనంతపురం గ్రామంలో వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్ప శుక్రవా రం ప్రచారం చేశారు. అదే పంచాయతీ ఏడో క్లస్టర్ వ లంటీరు రామక్రిష్ణ ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు.
- కదిరి నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణపల్లి పంచాయతీలో వైసీపీ అభ్యర్థి మగ్బూల్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వలంటీర్లు తిరుపాల్‌రెడ్డి, దాదాపీర్, యానిమేటర్ బాలక్రిష్ణారెడ్డి ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు.
- డీ. హీరేహాళ్ మండలంలోని పులకుర్తి గ్రామపంచాయతీ వసగుడ్డం గ్రామానికి చెందిన స్టోర్ డీలర్ నాగరాజు శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథరెడ్డి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రచారంలో డీలర్ పాల్గొనడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.







కదిరి: బ్రాహ్మణపల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు తిరుపాల్‌రెడ్డి, దాదాపీర్, యానిమేటర్ బాలకృష్ణారెడ్డి

విధుల నుంచి తొలగింపు

- రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో ఇద్దరు వలంటీర్లను అధికారులు విధుల నుంచి తొలగించారు. కణేకల్లు మండల కేంద్రంలో వైసీపీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వలంటీర్లు గంగాధర్‌రెడ్డి, లోకేశ్‌రెడ్డిని విధుల నుంచి తొలగించామని ఇన్‌చార్జి ఎంపీడీ ఓ గూడెన్న శుక్రవారం తెలిపారు. కాగా, లోకేశ్‌రెడ్డి వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశారని అన్నారు.
- పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డితో కలిసి ప్రచాంలో పాల్గొన్న ముగ్గురు వలంటీర్లను అధికారులు విధుల నుంచి తొలగించారు. ఓబుళదేవరచెరువు మండలం తుమ్మలకుంట్లపల్లికి చెందిన వలంటీర్లు అనిల్‌కుమార్, మంజుల, సుబ్బరామయ్యను విధులనుంచి తొలగించామని ఎంపీడీఓ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు.
- అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించిన ముగ్గురు వలంటీర్లపై వేటు పడింది. 38వ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ బి.కుళ్లాయమ్మ, 36వ సచివాలయం పరిధిలో వలంటీర్లు ఎన్.అబ్బాస్, డి.మహమ్మద్ రఫీని విధుల నుంచి తొలగిస్తూ కమిషనర్ మేఘస్వరూప్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అర్బన్‌లో ఏకంగా 18 మంది వలంటీర్లు వైసీపీ అభ్యర్థితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కొందరిపైనే చర్యలు తీసుకున్నారు. మిగిలినవారి పరిస్థితి ఏమిటో తేలాల్సి ఉంది.
- తాడిపత్రి నియోజకవర్గంలో వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు తాడిపత్రి మున్సిపల్ కార్యాలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మునీర్‌ను విధుల నుంచి తొలగించామని మున్సిపల్ కమిషనర్ రాంమోహన్ శుక్రవారం తెలిపారు.
- ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డీ హీరేహాళ్ మండలం పులకుర్తి గ్రామ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్‌ను విధుల నుంచి తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఈయన పులకుర్తి గ్రామ పంచాయతీ విధులు నిర్వర్తిస్తున్నాడు. వారం కిందట వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఈయన పాల్గొడంపై 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు విచారణ చేపట్టారు. అది నిజమని తేలడంతో గురువారం అతడిని విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఏపీఓ రామకృష్ణ తెలియజేశారు.

వైసీపీకి ఓటేయకపోతే పింఛన్ పీకేస్తాం

వలంటీర్ల బెదిరింపులు.. ఆర్డీఓకు బాధితుల ఫిర్యాదు



ఆర్డీఓ భాగ్యరేఖకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

పుట్టపర్తి రూరల్, మార్చి 22: వలంటీర్ల ఆగడాలకు హద్దేలేకుండా పోతోంది. వైసీపీ కోసం ఏకంగా ప్రజలను బెదిరించి, భయభ్రాంతులకు లోనుచేసే స్థాయికి చేరారు. 'వైసీపీకే ఓటెయ్యాలనీ, లేదంటే పింఛన్ పీకేస్తామ'ని వలంటీర్లు బెదిరిస్తున్నారంటూ మండలంలోని కప్పలబండకు చెందిన దివ్యాంగురాలు మాలపాటి చెన్నమ్మ, లక్ష్మీదేవి భర్త శేషగిరిరెడ్డి ఆవేదన చెందారు. ఆ మేరకు ఆర్డీఓ భాగ్యరేఖకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వారు.. ఆర్డీఓను కలిసి, ఫిర్యాదు చేశారు. బాధితులు మాట్లాడుతూ.. తమ ఆధార్, దివ్యాంగ ధృవపత్రాన్ని వలంటీర్లు తీసుకున్నారన్నారు. వైసీపీకి ఓటు వేయాలని హెచ్చరించారన్నారు. ఓటు ఎవరికి వేశారో తమకు తెలుస్తుందనీ, వైసీపీకి కాకుండా ఇతరులకు వేస్తే పింఛన్ పీకేస్తామంటూ వలంటీర్లు సరోజమ్మ, శ్యామల, రత్నమ్మ బెదిరిస్తున్నారని ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఆ మేరకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదుపై ఆర్డీఓను అడగ్గా.. వలంటీర్లపై విచారణ చేయాల్సిందిగా ఎంపీడీఓను ఆదేశించామన్నారు.

మంత్రి ఇంటికి చెక్‌పోస్టు

వైసీపీ సేవలో తరిస్తున్న పోలీసులు...?



మంత్రి ఇంటికి ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

పెనుకొండ టౌన్, మార్చి 22: రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖా మంత్రి ఉషశ్రీ చరణ్ ఇంటికి ఇంకా పోలీస్ బ్యారికేడ్లతో చెక్‌పోస్టు కొనసాగిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చి వారం కావస్తున్నా వైసీపీ సేవలోనే పోలీసులు తరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నా యి. పెనుకొండ నియోజక వర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ నివాసం, పార్టీ కార్యాలయం రెండూ స్థానిక డీఎస్పీ కార్యాలయం కాంపౌండ్‌కు ఆనుకుని ఉన్నాయి. గతంలో మంత్రి హోదాలో ఉన్న సమయంలో ఇక్కడ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అలానే కొనసాగిస్తున్నారు. ఎనికల కోడ్ వచ్చినా... ఇంకా తాను మంత్రినే, నాకు సేవలు చేయాల్సిందే అన్న ధీమాలో వైసీపీ అభ్యర్థి ఉష ఉన్నారని, అందుకే పోలీసులు చెక్ పోస్టును తీసేసేందుకు జంకుతున్నారని ప్రజలు అంటున్నారు. దీన్ని బట్టి చూస్తే ఎన్నికల్లో పోలీసుల తీరు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా పోలీసులు ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారా లేక వైసీపీపై భక్తి చూపుతారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీఎస్పీ బాజీ జైన్ సైదాను అడుగగా... ఈ విషయాన్ని స్థానిక ఎస్ఐకి తెలిపి చెక్‌పోస్టు తొలగిస్తామన్నారు.

రిలయన్స్ మార్ట్‌లో దోపిడీ కుట్ర భగ్నం

అనంతపురం క్రైం, మార్చి 22: అనంతపురం నగరంలోని రిలయన్స్ మార్ట్‌లో దోపిడీ చేసేందుకు పన్నిన కుట్రను వన్‌టౌన్ పోలీసులు భగ్నం చేశారు. ముగ్గురు సభ్యులున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. దీంతో పాటు హౌసింగ్ బోర్డులోని ఓ వ్యాపారి ఇంట్లో దొంగతనం చేయాలని ఇదే ముఠా కుట్ర పన్ని రెక్కి నిర్వహించింది. ప్రస్తుతం అరెస్టు అయిన బుజ్జల రుశ్యింగులు గతంలో గుజిరి, సిల్వరు సామన్లు వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో సుమారు రూ.7 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీర్చేందుకు తన దూరపు బంధువైన రిలయన్స్ మార్ట్‌లో పని చేసే రాగిరి శ్రీనివాసులు, కళ్యాణదుర్గానికి చెందిన చంటిను సంప్రదించాడు. వీరితో కలసి రిలయన్స్ మార్ట్‌లో దోపిడీ చేయడానికి కుట్ర పన్నాడు. రిలయన్స్ మార్ట్ నుంచి రోజు సుమారు రూ. 25 నుంచి 30 లక్షలు కలెక్షన్ డబ్బులు మేనేజర్ బ్యాంకుకు తీసుకెళ్లుతుంటాడని, మేనేజర్‌ను అడ్డగించి డబ్బులు దోపిడీ చేయాలని భావించారు. ఈ పథకం కోసం రెక్కి చేశారు. దీంతో పాటు హౌసింగ్ బోర్డులోని ఓ వ్యాపారి ఇంట్లో దోపిడీ చేయాలని పథకం పన్నారు. ఆ ఇంట్లో వృద్ధురాలు, కూతురు, బాలుడు మాత్రమే ఉంటారని, సులువుగా దోపిడీ చేయవచ్చునని భావించారు. దోపిడీ చేసే క్రమంలో అడ్డు వస్తే చంపివేయాలని అనుకున్నారు. స్పెషల్ బ్రాంచి నుంచి సమాచారం అందుకున్న ఎస్పీ ఈ రెండు కుట్రలను భగ్నం చేయాలని ఆదేశించారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప సిబ్బందితో కలసి బృందాలుగా ఏర్పడి నిఘా వేశారు. సూపర్ స్పెషాలిటి ఆసుత్రి వద్ద నిందితులను శుక్రవారం అరెస్టు చేసి వారి నుంచి మూడు వేటకొడవళ్లు, ఐరన్ రాడ్, ఆటో స్వాధీనం చేసుకున్నారు. వీరిలో రుశ్యింగులుపై పామిడి, పెనుగొండ, గుత్తి, రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసులు, అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు ఉంది. గొల్ల చండిపై మూడు దొంగతనం కేసులు అనంతపురం టూటౌన్, త్రీటౌన్‌లో ఉన్నాయి.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

గార్లదిన్నె: ఓ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడికి 10ఏళ్ల జైలు శిక్ష, రూ. 3 వేలు జరిమాన విధిస్తూ పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి శుక్రవారం తీర్పు ఇచ్చారు. అస్సోం రాష్ట్రానికి చెందిన పుష్ప బాగ్ అలియాస్ రాజు గార్లదిన్నె మండల కేంద్రంలో ఓ కూరగాయాల మండిలో పనిచేస్తుండేవాడు. అదే గ్రామానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతి చేశాడు. అనంతరం అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు 2023 మే 26న అప్పటి గార్లదిన్నె ఎస్ఐ సాగర్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతపురం రూరల్ డీఎస్పీ టీవీ వెంకటశివారెడ్డి 2023 జూన్ 15న కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసులో 14 మంది సాక్షులను విచారించారు. పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 3వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసును స్పెషల్ పీపీ విద్యాపతి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్స్ చౌవిరెడ్డి, శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ నాగార్జున, రజాక్ సాక్షులను సకాలంలో కోర్టుకు హజరు పరిచారు. వారిని ఎస్పీ అభినందించారు.



కొత్త ఓపీ కౌంటర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్ (ఫైల్),



ప్రస్తుతం నిరుపయోగంగా ఇలా...,



పాత కౌంటర్ల వద్ద ఓపీల కోసం క్యూకట్టిన రోగులు

ప్రచార ఆర్భాటమే

- కొత్త ఓపీ కౌంటర్లు ఓపెన్ చేశారు.. వదిలేశారు
- జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఓపీకి తప్పని తిప్పలు

అనంతపురం టౌన్, మార్చి 22: జిల్లా సర్వజన ఆస్పత్రిలో కొత్త ఓపీ కౌంటర్ల వ్యవహారం నవ్వుల పాలు చేస్తోంది. వైసీపీ పాలకుల ప్రచార ఆర్భాటానికి వేదికైంది. ఈ ఆస్పత్రికి రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రతి రోజు సరాసరిగా రెండు వేల మందికి పైగా ఈ ఆస్పత్రికి వస్తుంటారు. ఆస్పత్రి లోనే మహిళా, పురుష ఓపీ కౌంటర్లు ఉన్నాయి. జ నం అక్కడ ఓపీల కోసం క్యూ కడుతుంటారు. డాక్టర్లు, సిబ్బందితో పాటు రోగులు ఆస్పత్రిలోకి వెళ్ల డానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో ఆస్ప త్రి ఆవరణంలోనే పోలీస్ అవుట్ పోస్టు సమీపంలో ఉన్న గదుల్లో కొత్తగా ఆరు ఓపీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిని ఈనెల 14న స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి. నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ తదితరులు ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. అంతే ఆ తర్వాత వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దాదాపు పది రోజులు కావస్తున్నా... ఆ కొత్త ఓపీ కౌంటర్ల ద్వారా సేవలు ప్రారంభం కాలేదు. అవి నేటికీ ఖాళీగా దర్శన మిస్తున్నాయి. పాత ఓపీ కేంద్రాల వద్దనే రోగులు ఓపీల కోసం ఇబ్బందులు పడుతూనే ఉన్నా రు. దీనిపై అధికారులను ప్రశ్నించగా... సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయాల్సి ఉందని, ఎన్నికల కోడ్ వస్తుందని ముందుగానే వాటిని ప్రారంభించామని చెబుతున్నారు.

టీడీపీతోనే క్రిస్టియన్లకు న్యాయం

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, మార్చి 22 : తెలుగు దేశం పార్టీతోనే క్రిస్టియన్లకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో క్రిస్టియన్లకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాలన్నీ రద్దు చేయడంతో ఆ వర్గాలు తీవ్రంగా నష్ట పోయారని అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో క్రిస్టియన్లు అందరూ ఏకమై ఓటుతో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, టీడీపీ నాయకులు డిష్ నాగరాజు, మారుతీ కుమార్ గౌడ్, అజీజ్, జేఎం బాషా పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ చౌదరి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

అనంతపురం టౌన్, మార్చి 22: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా శుక్రవారం నగరంలో క్షయ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఈ.బీ. దేవి ప్రారంభించిన ఈ ర్యాలీ జిల్లా వైద్యశాఖ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు సాగింది. ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో క్షయ నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో క్షయ నివారణాధికారి అనుపమజేమ్స్, ప్రోగ్రాం ఆఫీసర్స్ సుజాత, ఓబులు. ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ సిరప్ప, సుదీంద్ర, డెమోలు ఉమాపతి, త్యాగరాజు, గంగాధర్, క్షయవిభాగ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రమణేపల్లిలో వైద్య శిబిరం

అనంతపురం సెంట్రల్, మార్చి 22: రాప్తా డు మండలం రమణే పల్లిలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మమత, రిజిస్ట్రార్ శశిధర్ ముఖ్య దీన్ని ప్రారంభించారు. బీపీ, షుగర్, గుండె తదితర పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీచేశారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చీనీకాయలు టన్ను రూ.22 వేలు

అనంతపురంరూరల్, మార్చి 22: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.15 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 200 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యామద్దలలో కార్డెన్ సెర్చ్

చెన్నేకొత్తపల్లి, మార్చి 22: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని... మండలంలోని న్యామద్దల గ్రామంలో శుక్రవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ట్రైనీ డీఎస్పీ పృథ్వీతేజ్ ఆధ్వర్యంలో అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అదేవిధంగా సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, బీటీ.వెంకటేశ్వర్లు, మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై సమావేశం

రాప్తాడు, మార్చి 22: ఎన్నికల విధులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సెక్టార్, రూట్ ఆఫీసర్లతో రాప్తాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ఏఏ అధికారులు ఎలా విధులు నిర్వహించాలి... ఏ విధమైన సూచనలు పాటించాలి.. అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఆలయ షెడ్డు నిర్మాణానికి విరాళం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 22: పాతూరులో బసవేశ్వరస్వామి ఆలయ షెడ్డు నిర్మాణానికి రాయలసీమ బలిజ మహాసంఘం యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్, 40వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మి భర్త నలబోలు మధుసూదన్ రూ. 60 వేలు విరాళం అందజేశారు. శుక్రవారం ఆలయ చైర్మన్ సాంబశివుడికి ఆ విరాళాన్ని అందజేశారు.

బాధితుడికి 'అమ్మ' చేయూత

అనంతపురం ప్రెస్‌క్లబ్: రోడ్డు ప్రమాదంలో కాళ్లు, చేతులు విరిగి మంచానికి పరిమితమైన ఆటో డ్రైవర్ రఫీకి అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. శుక్రవారం రమణారెడ్డి రఫీ ఇంటికెళ్లి రూ. 35 వేలు విలువ చేసే సర్జికల్ మంచం, రూ. 10 వేలు విలువ చేసే వీల్ చైర్, పాప చదువు కోసం రూ. 30వేలు, నిత్యావసరాల కోసం రూ. 30 వేలు ఆర్థికసాయం అందించారు.

ప్రచారాలపై నిఘా వేయండి

నార్పల, మార్చి 22: రాజకీయ నాయకులు చేపట్టే ప్రచారాలపై నిఘా వేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆ ప్రచారంలో పాల్గొంటే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల విస్తరణ అధికారి శైలజారాణి, సెక్టోరియల్ ఆఫీసర్ ఉమాదేవి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చెన్నేకొత్తపల్లి, మార్చి 22: మండలంలో పోలేపల్లికి చెందిన ఓ వ్యక్తి, శుద్ధకుంటపల్లి తండాకు చెందిన మరో వ్యక్తి తిరుమణి నుంచి ద్విచక్రవాహనాల్లో వేరువేరుగా 417 టెట్రాప్యాకెట్లను తరలిస్తుండగా.. గురువారం రాత్రి రామగిరి మండలం అక్కంపల్లి వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు ఆ రెండు బైక్‌లనూ స్వాధీనం చేసుకొని.. వారిని అరెస్ట్ చేసి.. కేసు నమోదు చేసినట్లు సెబ్‌సీఐ లలితాదేవి శుక్రవారం తెలిపారు.

కోడ్ అమల్లో ఉన్నా...

అనంతపురం క్రైం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే విపక్షాల పోస్టర్లను, ఫ్లెక్సీలను గంటల వ్యవధిలో అధికారులు తొలగించారు. అయితే నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న వైసీపీ ఫ్లెక్సీలు, పోస్టర్లను నేటికీ తొలగించలేదు.





ఎస్కేడీ స్కూల్ వద్ద ఓ ఇంటి ముంగిట, రహమత్ నగర్‌లో ఇలా





అనంతపురం ఎమ్మెల్యే ఇంటికి జగన్ ఫొటో, ఎమ్మెల్యే ఇంటి సమీపంలో పోస్టర్





పాతూరులో, పాతూరు ఐరన్ బ్రిడ్జి వద్ద పోస్టర్

పీఏనా.. మజాకా..!

- తన బంధువు ఉన్న సందుకు సీసీ రోడ్డు
- మండల నిధులు రూ.9 లక్షలతో పనులు
- ఏళ్లుగా ప్రజలు ఇస్తున్న అర్జీలు బుట్టదాఖలు







పీఏ బంధువుల ఇంటి సందులో వేస్తున్న రోడ్డు, పక్క సందు దుస్థితి, పీఏ బంధువుల ఇంటికి వెళ్లే ప్రధాన రోడ్డు

అనంతపురంరూరల్, మార్చి 22: ఆయనొక స్థానిక ప్రజాప్రతినిధికి పీఏ. అధికార బలం.. పలుకుబడి ఉన్నప్పుడే ఇల్లు చక్క బెట్టుకోవాలనుకున్నాడో ఏమో.... అందుకు అనుగుణంగానే అనంతపురం రూరల్ మండలం పాపంపేట పంచాయతీలోని తనకు బంధువులుంటున్న సందుకు మాత్రమే సీసీ రోడ్డు మంజూరు చేయించుకున్నాడు. ఆ మేరకు రోడ్డు నిర్మాణ పనులు చకచక జరిగిపోతున్నాయి. ఆ చుట్టూ పక్కల సందులైనా బాగున్నాయంటే ఆ పరిస్థితి లేదు. మరి ముఖ్యంగా సదరు పీఏ బంధువుల ఇంటికి వెళ్లే ప్రధాన వీధి రోడ్డు కూడా మట్టి రోడ్డే. అది కూడా గుంతలు పడ్డాయి. మరి అధికారులు ఏ మేరకు రోడ్డు మంజూరు చేశారో.. వారికే తెలియాలి. ఇదిలా ఉండగా పీఏ బంధువులుంటున్న.. పక్క సందుల వారు రెండు మూడేళ్ల కిందట సీసీ రోడ్డు కోసం అధికారులకు అర్జీలు పెట్టుకున్నా... స్పందన లేదు. అయితే పీఏ పలుకుబడి ముందు ఆ అర్జీలన్నీ బుట్టదాఖలైనట్లయింది.

రూ. 9 లక్షల మండల నిధులతో ...

ఎక్కడైనా ఓ చోట రోడ్డు వేయాలంటే స్థానికులకు నానా అవస్థలు పడాల్సిందే. కింది స్థాయి చోట.. నాయకుడి నుంచి స్థానిక ప్రజాప్రతినిధికి, అధికారులకు చెప్పడంతో పాటు ఎన్నో అర్జీలు ఇచ్చుకోవాలి. లేదంటే తమ రోడ్డు వంతు వచ్చే సరికి ఏళ్లు పడుతుంది. అయితే మండలంలోని పాపంపేట పంచాయతీ ద్వారకా విలాస్ ఎదుట ప్రాంతంలో స్థానిక ప్రజాప్రతినిధి పీఏ బంధువులు ఉన్నారు. దీంతో వారున్న సందుకు మాత్రమే సీసీ రోడ్డు వేస్తున్నారు. అది మండల నిధులు కింద రూ.9 లక్షలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే పనులు కూడా ప్రారంభమైయ్యాయి. అయితే పక్క సందులు మరింత అధ్వానంగా ఉన్నా ఆ రోడ్ల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

సాయుధ బలగాల కవాతు

ధర్మవరంరూరల్, మార్చి 22: కనగానపల్లి మండలంలోని తూముచెర్ల, తగరకుంట గ్రామాల్లో సాయుధ బలగాలు శుక్రవారం ట్రైనీ డీఎస్పీ పృథ్వీ, సీఐ శివాంజనేయులు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించాయి. ఎటువంటి గొడవలు పడినా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఇందుఓ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం క్రైం, మార్చి 22: నగరంలోని హౌసింగ్ బోర్డులో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిపై టూటౌన్ పోలీసులు దాడి నిర్వహించారు. టూటౌన్ సీఐ క్రాంతి కుమార్ శుక్రవారం సిబ్బందితో కలిసి ఈ దాడి చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు విటులను అరెస్టు చేశారు.

ఎస్వీఐటీలో ముగిసిన వర్క్‌షాప్

రాప్తాడు, మార్చి 22: మండలంలోని హంపాపురం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ వెహికల్స్ అనే అంశంపై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఎలక్ట్రికల్ వెహికల్ సీఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యత పెంచడానికి ఈ కళాశాల ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీటీఆర్ శర్మ, ఎండీ రమాకాంతరెడ్డి, చైర్మన్ క్రిష్ణారెడ్డి, వైస్ చైర్మన్ రవీంద్రారెడ్డి, సీఈఓ ఆనంద్‌కుమార్, ప్రిన్సిపల్ విష్ణువర్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి తిరోగమనం





ఉల్లికల్లులో ప్రచారం నిర్వహిస్తున్న బండారు శ్రావణిశ్రీ, ఆలం, ముంటిమడుగు, నరసాపురంలో వైసీపీ నాయకులను టీడీపీలో ఆహ్వానిస్తున్న ఆలం

టీడీపీ శింగనమల అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

శింగనమల, మార్చి 22: వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 25 ఏళ్ల వెనక్కు వెళ్లిందని శింగనమల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ మండిపడ్డారు. శింగనమల మండలంలోని ఉల్లికల్లు, ఉలికంటిపల్లి, కొరివిపల్లి, అలంరియపేట గ్రామాల్లో ఆమె ద్విసభ్యకమిటీ సభ్యుడు అలం నరసా నాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డితో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి కరవై వలస బాట పడుతున్నారని, ఇలాంటి తరుణంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తెచ్చే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు.

రైతు ఆత్మహత్యకు వైసీపీ బాధ్యత వహించాలి

వెస్టునరసాపురం గ్రామానికి చెందిన రైతు సంజీవకుమార్ ఆత్మహత్యకు వైసీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని బండారు శ్రావణిశ్రీ డిమాండ్ చేశారు. సంజీవకుమార్ మృతదేహానికి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో నివాళులర్పించిన ఆమె మాట్లాడారు. వైసీపీ పాలనలో పంటలకు గిట్టుబాటు ధర లేక... ఇవ్వాల్సిన నష్టపరిహారం, బీమా, సబ్సిడీలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలయ్యారన్నారు. దీంతో వారి ఆత్మహత్యలకు వైసీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

నార్పల : మండలంలోని నరసాపురం గ్రామంలో బండారు శ్రావణి తరపున టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలం ఆధ్వర్యంలో మాజీ వైస్ సర్పంచ్ సుశీలమ్మ, వైసీపీ నాయకులు సీవీ గోపాల్‌రెడ్డి, రంగారెడ్డి కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.



చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రంలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబిలేసు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచారం



రామగిరి మండలం చెర్లోపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల ప్రచారం



బుక్కరాయసముద్రంలో ఇంటింటి ప్రచారంలో ద్విసభ్యకమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు, అశోక్



రాప్తాడు మండలం పాలబావిలో ప్రచారం చేస్తున్న మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి, టీడీపీ నాయకులు



అనంతపురంరూరల్ మండలం నరసనాయునికుంటలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు



ఆత్మకూరు పంచాయతీ కుర్లపల్లి గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు

బాబు పాలనపై సీడీ ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్, మార్చి 22: చంద్రబాబు ఔన్నత్యం, పాలనపై సామాజిక కార్యకర్త, కాలమిస్ట్ నల్లాని రాజేశ్వరి రూపొందించిన వీడియో సీడీని మంగళగిరిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శుక్రవారం ఆవిష్కరించారు. నల్లాని రాజేశ్వరి మాట్లాడుతూ.. సీనియర్ కవి బిక్కి కృష్ణ ఈ పాటలను రచించగా.. సినీ సంగీత దర్శకుడు చిన్నికృష్ణ చక్కని బాణీలను సమకూ ర్చారన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సీఈఓ గుత్తా హరిసర్వోత్తమనాయుడు పాల్గొన్నారు.



నారా లోకేశ్‌తో నల్లాని రాజేశ్వరి

దుండగులపై చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్, మార్చి 22: అనంతపురం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పరకలు కట్టిన దుండగులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు త్రీ టౌన్ సీఐ ధరణికిశోర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవా రం టీడీపీ నాయకులు మారుతీకుమార్ గౌడ్, ముక్తియార్, వన్నూర్ ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్టీఆర్ విగ్రహంపై రాళ్ల దాడి చేయడంతో విగ్రహం దెబ్బతిందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



సీఐకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

జల సంరక్షణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, మార్చి 22 : అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి సంరక్షణ, పొదుపుపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పద్మశ్రీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



మున్సిపల్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

అనంతపురం కార్పొరేషన్ : అనంత వాటర్ ప్లాంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో నగరంలోని నాలుగు రద్దీ ప్రదేశాల్లో చలివేంద్రాలను ప్రారంభించారు. మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ వై. మేఘా స్వరూప్ ప్రారంభించారు. కార్యక్రమంలో అనంత వాటర్ ప్లాంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంటిమిద్దె రామ్మోహన్, గౌరవాధ్యక్షుడు రామసుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్ ఆకుల హరీష్‌కుమార్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, అడ్వైజర్ నజీర్ బాషా, ఈసీ మెంబర్ విజయ్‌కుమార్, సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

నీటి కొరతతో వివాదాలు

అనంతపురం క్లాక్‌టవర్ : నీటి వనరుల కొరతతో కుటుంబాలు, వ్యవసాయ వర్గాలు, రాష్ట్రాల మధ్య అంతులేని వివాదాలకు దారి తీస్తోందని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో శాంతి కోసం నీరు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నీటి సంరక్షణ, పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. తక్కువ నీటితో పండించే పంటలను సాగు చేయాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నరసింహారావు సూచించారు. కార్యక్రమంలో ఏపీ మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త సహదేవరెడ్డి, ఏపీమాస్ సంస్థ కళామణి, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ కో-ఆర్డినేటర్ భ్రమరేశ్వరరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

అనంతపురంరూరల్ : స్థానిక పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులకు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నీటి సంరక్షణకు సంబంధించిన సాహిత్య పోటీల్లో విజేతలకు ప్రిన్సిపల్ రమేష్‌బాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ డాక్టర్ మనోహర్‌రెడ్డి, విద్యార్థి కార్యచరణ సెల్ కన్వీనర్ ఆనంద్ దంపెల్ల, కో-కన్వీనర్ మనోజ్ పాల్గొన్నారు.

పట్టించుకోకుంటే పార్టీ మారుతాం

ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్యకు వైసీపీ నాయకుల హెచ్చరిక

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 22: తమను పట్టించుకోక పోతే పార్టీ మారుతామని పలువురు వైసీపీ నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్యను హెచ్చరించారు. మండల పరిధిలోని పాపంపల్లిలో గురువారం రాత్రి వారు ఓ వైసీపీ నాయకుడి ఇంట ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉషశ్రీ చరణ్ వర్గం అని నిందలు వేసి తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమ పంచాయతీలో తలారి రంగయ్య పర్యటించిన సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోతున్నారని ఆరోపించారు. మేము పార్టీ కోసం పని చేస్తున్నామని, ఏ వర్గీయులం కాదన్నారు. నిరసనలో ఉప సర్పంచ్ బాబు, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు రామాంజినేయులు, ఈరన్న, పాత లింగప్ప, వీరలింగప్ప, నారాయణస్వామి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఓటర్లదే

- మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి


వేములపాడులో పర్యటిస్తున్న జేసీ దివాకర్‌రెడ్డి

యాడికి, మార్చి22: అభివృద్ధి చేసేవారికి ఓటువేసి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఓటర్లదేనని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వేములపాడు, కొట్టాలపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామస్థులను కలిసి సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం పరిస్థితి అల్లకల్లోలంగా ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టాలని ఆయన ప్రజలను కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అఖిల్‌రెడ్డి, మైలా ఆదినారాయణ, షరీఫ్, గంగరాజు, హరి, రాఘవ, రామాంజనేయులు, రామకృష్ణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి తోడ్పాటు అందించండి


గ్రామంలో పర్యటిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, మార్చి22: సైకిల్ గుర్తుకు ఓటువేసి మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, గంగరాజుయాదవ్, హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచు నారాయణస్వామి, చిరంజీవులు, హరికృష్ణారావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేసి టీడీపీని గెలిపిద్దాం

- తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్


మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దపప్పూరు, మార్చి22: సమష్టిగా పనిచేసి టీడీపీని గెలిపించుకుందామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మనచెరువు లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపాన మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జేసీపీఆర్ మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలోని అంశాలను అమలుచేస్తామని తెలియజేయాలన్నారు. సమావేశంలో జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, గుర్రి రఘునాయుడు, బీసీ రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, శివశంకర్‌రెడ్డి, షెక్షావలి, మహానంది నల్లప్ప, సర్పంచు శంకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణస్వామి, చిన్న పాల్గొన్నారు.

కోడ్ కూసినా తొలగని రంగులు


కూడేరులోని సచివాలయానికి వైసీపీ జెండా రంగులు

కూడేరు/బొమ్మనహాళ్, మార్చి 22: ఎన్నికల కోడ్ వచ్చి రోజులు గడుస్తున్నా ప్రభుత్వ భవనాలకు వేసిన వైసీపీ జెండా రంగులు తొలగడం లేదు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలకు రంగులు అలాగే కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల సీఎం జగన్ బొమ్మలు అలాగే ఉన్నాయి. పత్రికల్లో వార్తలు వస్తున్నా తొలగించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



శ్రీధరఘట్ట పాత రైతు భరోసా కేంద్రానికి వైసీపీ రంగు, వృత్తంలో ఉన్న జగన్ బొమ్మ

పయ్యావుల కేశవ్‌ను గెలిపించండి

ఉరవకొండ,మార్చి22: త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను గెలిపించాలని ఆయన తనయుడు విజయ్ సింహ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, గోవిందు, సుధాకర్, మేకల తిప్పన్న, దేశాయ్ మల్లికార్జున, ఎర్రిస్వామి, నాగరాజు, కుమార్, చిన్నరాయుడు, గురు పాల్గొన్నారు.

తండ్రిని కోల్పోయిన బాధను దిగమింగి పరీక్షకు..


పరీక్ష రాసేందుకు వెళ్తున్న దీక్షిత (వృత్తంలోని బాలిక)

బెళుగుప్ప, మార్చి 22: మండలంలోని ఆవులెన్న గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని దీక్షిత తన తండ్రి నరసింహులు రోడ్డు ప్రమాదంలో గాయపడి గురువారం మృతి చెందినా సడలని సంకల్పంతో శుక్రవారం పబ్లిక్ పరీక్ష రాసింది. ఈమె శ్రీనివాస విద్యానికేతన్‌లో చదువుతోంది. పాఠశాల కరెస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సుమ విద్యార్థి ఆత్మస్థైర్యం కోల్పోకుండా పరీక్షలు బాగా రాయాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులతోనే మంచి దిగుబడి


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

బొమ్మనహాళ్, మార్చి 22: యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయ డీడీఏ మద్దిలేటి, ఏడీఏ శైలజ అన్నారు. శుక్రవారం మండలంలోని గోనేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాలలో ఆమె వరి పొలాలను పరిశీలించారు. వరిపంటను పరిశీలించి వాటికి సోకిన రోగాలు గురించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం వరి పంటలో తొలుచు పురుగు ఎక్కువగా ఉందని దాని నివారణ కోసం క్రిమిసంహారక మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో టీడీపీ గెలుపు తథ్యం


ప్రచారం చేస్తున్న అమిలినేని సురేంద్రబాబు చెల్లెలు రాధ


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సురేంద్రబాబు భార్య రమాదేవి

పార్టీ కార్యకర్తల ధీమా

కళ్యాణదుర్గం, మార్చి 22: నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు గెలుపు తథ్యమని ఆయా గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు, మహిళలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం శెట్టూరు మండలంలోని చెర్లోపల్లిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు చెల్లెలు రాధ, సోదరుడు యర్రిస్వామి కుటుంబ సభ్యులు, కళ్యాణదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని ముదిగల్లులో భార్య రమాదేవి, కోడలు ఇషిత ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అభ్యర్థి సురేంద్రబాబు ను గెలిపించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా టీడీపీకి ఆదరణ లభిస్తోందన్నారు. టీడీపీ నాయ కులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషి చేస్తే ఈ సారి అత్యధిక మెజార్టీతో కళ్యాణదుర్గంలో విజయం సాధిస్తామన్నారు. టీడీపీతోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి పథంలో నడవడం టీడీపీ పాలనలోనే సాధ్యమన్నారు. ఈక్రమంలోనే అమిలినేని సురేంద్రబాబుకు ఓటేసి గెలిపించి అభివృద్ధికి పాటుపడాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పాల వెంకటాపురంలో ఇంటింటి ప్రచారం


పాలవెంకటాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

బ్రహ్మసముద్రం: మండలం పాల వెంకటాపురం గ్రామంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు రాహుల్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పాల బండ్ల శ్రీరాములు, అమర్, రామ్మోహన్, గురు గౌడ్, క్లస్టర్ వన్ ఓబుళేసు, నాగరాజు, గంగిరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి

కణేకల్లు, మార్చి 22: మండలంలోని హనుమాపురం గ్రామానికి చెందిన సన్నప్పరెడ్డి గారి రఘురాములు అనారోగ్యంతో గురువారం మృతి చెందగా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆయన మృతికి నివాళులు అర్పించారు. శుక్రవారం గ్రామానికి చేరుకున్న కాలవ రఘురామ మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. గ్రామంలో టీడీపీ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఆయన లేని లోటు పార్టీకి తీరనిదని కాలవ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లాలెప్ప, టీడీపీ నాయకుడు వేలూరు మరియప్ప, ఆది, శరభనగౌడ్, అశోక్, ఎంపీటీసీ నరేంద్ర, తూర్పింటి రఘునాథ్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

పామిడి, మార్చి 22: మండలంలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బంధువులు, స్థానికుల సమాచారం మేరకు... మండలంలోని సొరకాయలపేట గ్రామానికి చెందిన సాదం సుబ్రహ్మణ్యం పామిడి నుంచి స్వగ్రామానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పామిడి స్టేషన్ గ్రామ సమీపాన అదుపుతప్పి పక్కనున్న కాలువలో పడ్డాడు. గాయపడిన అతడిని స్థానికులు పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన రమేష్ పామిడి నుంచి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. ముందు వెళ్తున్న ఆటోను ఢీ కొనడంతో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో రమేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రున్ని స్థానికులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

లారీ డ్రైవర్ మృతి

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 22: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ ఎదుట ఖాళీ స్థలంలో గురువారం లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు తెలంగాణ రాష్ట్రం అయ్యవారిపేట గ్రామానికి చెందిన హరిజన వెంకటేశ్వరరావు(30) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కట్టెల బొగ్గు కోసం కళ్యాణదుర్గం వచ్చి బొగ్గు తీసుకుని కాటా దగ్గర వెయిట్ వేసిన తర్వాత ఏపీ మోడల్ స్కూలు ఎదుట ఖాళీ స్థలంలో బిల్ కోసం వేచి ఉన్నాడు. ఫోన్లో మాట్లాడుతూ అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన మరో లారీ డ్రైవర్ బాలాజీ వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య సోమియా, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జితేంద్రగౌడుకు టిక్కెట్టు ఇవ్వాలని వినతి

గుంతకల్లు, మార్చి22: స్థానిక అసెంబ్లీ టీడీపీ టిక్కెట్టును మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడుకు ఇవ్వాలని గుంతకల్లుకు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబునాయుడుకు విన్నవించారు. శుక్రవారం హైదరాబాదుకు వెళ్లిన వారు చంద్రబాబు నాయుడు ఇంటి వద్ద నిలిచి ఆయన్ను కలిశారు. కార్యకర్తలను చూసిన చంద్రబాబు నాయుడు కారును ఆపి వారి విజ్ఞప్తిని ఆలకించి, పరిశీలిస్తానంటూ హామీ ఇచ్చి వెళ్లిపోయారు. చంద్రబాబును కలసిన వారిలో గుంతకల్లు టీడీపీ నాయకులు కేశప్ప, హనుమంతు, బండి లక్ష్మీదేవి, అంజలి, గుత్తి నాయకులు శ్రీనివాస యాదవ్, దిల్కా సీన, ఉన్నారు.

ద్విచక్రవాహనంలో నగదు చోరీ

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 22: ఓవ్యక్తి ద్విచక్రవాహనంలో రూ. 2.5 లక్షలు తీసుకుని వెళుతుండగా రద్దీ ప్రదేశమైన గాంధీచౌక్‌లో చోరీ శుక్రవారం జరిగింది. బాధితుడు రామకృష్ణ తెలిపిన మేరకు... వాల్మీకి సర్కిల్ బ్రాంచ్ అనంత గ్రామీణ బ్యాంకులో బిజినెస్ కరెస్పాండెంట్‌గా రామకృష్ణ పని చేస్తున్నాడు. నగదు తక్కువ రావడంతో బ్యాంకు అనుమతితో మెయిన్ బ్రాంచ్ దగ్గరికి వెళ్లి రూ. 2.5 లక్షలు తీసుకుని ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. దీన్ని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు చాకచక్యంగా దొంగిలించారు. బ్యాంకు దగ్గరికి వెళ్లిన రామకృష్ణ బ్యాగ్ తీసి చూడగా నగదు కనిపించకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

హనుమద్‌వాహనంపై చెన్నకేశవుడు

యాడికి, మార్చి 22: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చెన్నకేశవస్వామి భక్తులకు హనుమద్ వాహనంపై దర్శనమిచ్చారు. తహసీల్దార్ మోహనవల్లి, ఆర్ఐ ఆనంద్‌బాబు ఆచారిస్వామి వారిని దర్శించుకున్నారు.

మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ

పెద్దవడుగూరు, మార్చి22: మండలంలోని దిమ్మగుడి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామానికి చెందిన మాకిరెడ్డి రామకృష్ణారెడ్డి, కాంతమ్మ దంపతులు ఆలయ నిర్మాణానికి రూ.30లక్షలు ఇవ్వడంతో గ్రామస్థులు వారిని సత్కరించారు.

అండగా ఉంటాం: పయ్యావుల శ్రీనివాసులు


పరామర్శిస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

కూడేరు, మార్చి 22: మండలంలోని కరుట్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఎర్రిస్వామి నాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య, కురుగుంట ప్రసాద్, వెంకటప్ప నాయుడు, చింతల నాయుడు, ఎంఎంహళ్లి దేవేంద్ర, తిరుపాల్ నాయుడు, సోమర చిన్న వెంకటరాముడు, ఆర్. లక్ష్మీనారాయణ, ఆర్. ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే రాష్ట్ర అభివృద్ధి


సోమలాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

డీ.హీరేహాళ్, మార్చి 22: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని సోమలాపురం ఎంపీటీసీ మొండి మల్లికార్జున అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని సోమలాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాజశేఖర్, శంకర్, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

యాడికిలో సీతారాముల కల్యాణం


అలంకరణలో సీతారాముల విగ్రహాలు

యాడికి, మార్చి22: స్థానిక చౌడేశ్వరికాలనీలో శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. రాముని ఆలయానికి ఓగేటి సూర్యనారాయణ దంపతులు ఉత్సవ మూర్తులను బహూకరించారు. వారంరోజుల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం భక్త జనసందోహం మధ్య సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, ఆదినారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, కాల నీవాసులు ఉన్నారు.

పేదలకు వరం ఆర్డీటీ

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 22: బడుగు, బలహీన వర్గాలకు ఆర్డీటీ సంస్థ వరమని జీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పేనాయక్ అన్నారు. శుక్రవారం ఆర్డీటీ ఆస్పత్రికి ఎదురుగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్య, వైద్య, ఉపాధి శిక్షణ, మహిళల అభివృద్ధి కొరకు అనేక సంక్షేమాలు అమలు చేసి పేద ల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ధనుంజయ నాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సాకే గురుమూర్తి, లాయర్ ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌లు తనిఖీ చేసిన సెబ్ డిప్యూటీ కమిషనర్


చెక్‌పోస్టులో రికార్డులను పరిశీలిస్తున్న సెబ్ డిప్యూటీ కమిషనర్

డీ.హీరేహాళ్, మార్చి 22: మండలంలోని ఓబుళాపురం చెక్‌పోస్టును సెబ్ డిప్యూటీ కమిషనర్ వీరశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం చెక్‌పోస్ట్ సిబ్బందితో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ: విడపనకల్లు మండలంలోని కర్ణాటక, ఆంధ్ర సరిహద్దులోని చెక్‌పోస్టులను సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తనిఖీ చేశారు. విడపనకల్లు, డొనేకల్లు చెక్‌పోస్టులను పరిశీలించారు. డొనుకల్లు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి బాటిళ్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఉరవకొండలోని సెబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెబ్ అధికారులు పాల్గొన్నారు.

పట్టించుకోకుంటే పార్టీ మారుతాం

ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్యకు వైసీపీ నాయకుల హెచ్చరిక


బైఠాయించిన వైసీపీ నేతలు

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 22: తమను పట్టించుకోకపోతే పార్టీ మారుతామని పలువురు వైసీపీ నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్యను హెచ్చరించారు. మండల పరిధిలోని పాపంపల్లిలో గురువారం రాత్రి వారు ఓ వైసీపీ నాయకుడి ఇంట ఎదుట బైఠాయించారు. వారు మాట్లాడుతూ మంత్రి ఉషశ్రీ చరణ్ వర్గం అని నిందలు వేసి తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమ పంచాయతీలో తలారి రంగయ్య పర్యటించిన సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోతున్నారని ఆరోపించారు. తాము పార్టీ కోసం పని చేస్తున్నామని, ఏ వర్గానికీ చెందిన వారం కాదన్నారు. నిరసనలో ఉప సర్పంచ్ బాబు, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు రామాంజినేయులు, ఈరన్న, పాత లింగప్ప, వీరలింగప్ప, నారాయణస్వామి, దేవేంద్ర పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుష్మిత

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 22: ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్డీవో రాణి సుష్మిత, కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసు లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పురవీధుల్లో కవాతు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గొడవ లు, అల్లర్లు లేని ఎన్నికలు నిర్వహించడమే ఎన్నికల కమిషన్ లక్ష్యమన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేసేలా పోలీసులు పరిస్థితులు కల్పించ డమే ఈ కవాతు ఉద్దేశం అన్నారు. ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి టీ కూడలి, బళ్లారి మిట్ట, వాల్మీకి సర్కిల్ వరకు కవాతు కొనసాగింది.

ఓటు హక్కుపై ట్రాన్స్‌జెండర్లకు అవగాహన

ఓటు హక్కుపై ట్రాన్స్‌జెండర్లకు ఆర్డీవో రాణిసుష్మిత అవగాహన కల్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆమె డీఎస్పీ శ్రీనివాసులుతో కలిసి ట్రాన్స్‌జెండర్లకు ఈవీఎంల వాడకం గురించి వివరించారు. ఓటును నిబద్ధత, నిజాయతీతో ఉపయోగించుకోవాలని సూచించారు.

జగన్‌ను నమ్మి ఓటేస్తే రాష్ట్రమే ఉండదు: టీడీపీ


దర్గాహొన్నూరులో టీడీపీ నాయకుల ప్రచారం

బొమ్మనహాళ్, మార్చి 22: ఒక్కసారి జగన్‌ను నమ్మి ఓటు వేసినందుకు రాజధాని లేకుండా పోయింది. మరోసారి నమ్మి ఓటు వేస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే లేకుండా పోతుందని టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు కేశప్పలు అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీధరఘట్ట, హరేసముద్రం, దర్గాహొన్నూరు గ్రామాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సూపర్‌సిక్స్ పథకాల ను ప్రజలకు వివరించారు. వైసీపీ మాయ మాటలు నమ్మి మరోసారి మోసపోకండని హెచ్చరించారు. సైకిల్‌గుర్తుకు ఓటు వేసి కాలవ శ్రీనివాసులు ను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిప్పేస్వా మి, ఎర్రిస్వామి, లింగప్ప, రామస్వామి, ముక్కన్న, వీఎల్ రామాంజినేయులు, మొండి చెన్నప్ప, సర్మాస్‌వలి, మాజీ సర్పంచ్ పల్లి తిప్పేస్వామి, మహమ్మద్ రఫీ, శ్రీరాములు పాల్గొన్నారు.

రైల్వే జోనల్ కమిటీ సభ్యుడిగా శేఖర్‌బాబు

గుత్తి, మార్చి 22: దక్షిణ మధ్య రైల్వే మజ్దూరు యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా శేఖర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సికింద్రాబాద్‌లో గురువారం నిర్వహించిన జోనల్ కమిటీ సమావేశంలో గుత్తికి చెందిన లోకోపైలెట్ మజ్దూరు యూనియన్ ఓపెన్ లైన్ బ్రాంచ్ సెక్రటరీ శేఖర్‌బాబును ఎంపిక చేశారు. ఈయన ఎంపిక పట్ల స్థానిక యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మట్టి పెళ్లలు విరిగిపడి యువకుడికి గాయాలు

రాయదుర్గంరూరల్, మార్చి 22: పట్టణ సమీపంలోని నాన్‌చెరువులో మట్టిపెళ్లలు విరిగిపడి సర్మాస్ అనే కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. రాయదుర్గం పట్టణంలోని గ్యాస్‌గోడౌన్ ఏరియాకు చెందిన సర్మాస్ ప్రతి రోజూ ట్రాక్టర్ పనులకు వెళ్లేవాడు. అందులో భాగంగా నాన్‌చెరువులో మట్టిని లోడ్ చేస్తుండగా మట్టిపెళ్లలు విరిగి మీద పడడంతో కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక కూలీలు గమనించి అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రచారంలో వలంటీర్లు పాల్గొంటే తొలగిస్తాం

రాయదుర్గంరూరల్, మార్చి 22: ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొంటే తొలగిస్తామని నియోజకవర్గ ఎన్నికల నోడల్ ఆఫీసర్ అల్లాబకాష్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆయా గ్రామాలలో ఇంటింటికి అతికించిన స్టిక్కర్లను వెంటనే తొలగించాలన్నారు. బ్యానర్లు, స్టిక్కర్లు, జెండాలు తొలగించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు, ఫీల్డు అసిస్టెంట్లు, ఆశవర్కర్లు, ఆయాలు పాల్గొంటే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గుమ్మఘట్ట ఎంపీడీఓ గౌరీదేవి, ఈఓపీఆర్డీ రంగనాయకులు, ఏఓ చిక్కణ్ణ, ఏపీఓ దేవరాజ్, ఏపీఎం జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న విలువల బడి విద్యార్థులు

కుందుర్పి, మార్చి 22: ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న విలువల బడులలో ప్రపంచ జల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని అపిలేపల్లి, బెస్తరపల్లి, తూముకుంట, బసాపురం, మలయనూరు, కెంచంపల్లి గ్రామాల్లో విలువల బడుల విద్యార్థులు ర్యాలీగా వెళ్లి చెట్లను పెంచండి పర్యావరణాన్ని పరిరక్షించండి, నీటిని పొదుపు చేయండి మా భవిష్యత్తును కాపాడండి అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విలువలబడి కోఆర్డినేటర్లు లక్ష్మణమూర్తి, బొమ్మలింగ, రఘువీరా, దిలీప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

గుత్తి, మార్చి 22: గుత్తి రైల్వే స్టేషన్ సమీపంలో కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 702 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నబీ రసూల్ శుక్రవారం తెలిపారు. గుత్తి ఆర్ఎస్‌లోని చెర్లోపల్లి రోడ్డులోని రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి బ్యాగ్‌ను తనిఖీ చేయగా ఓరిజినల్ చాయిస్ కంపెనీకి చెందిన 702 టెట్రా ప్యాకెట్లు బయటపడ్డాయన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఎరుకుల సుజాత, ఎరుకుల నాగేంద్రలు బెంగళూరు నుంచి వివిధ దుకాణాలలో మద్యం కొనుగోలు చేశారు. రైలు ప్రయాణంలో భాగంగా గుత్తి రైల్వే స్టేషన్‌లో దిగి ఇక్కడ నుంచి పత్తికొండకు తీసుకెళ్లి ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.